andhrajyothy.com ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.3 ; కనిష్ఠం 27.2

ఆంధ్రజ్యోతి



నిజామాబాద్
జిల్లా వార్తలు

5 సోమవారం 21 ఏప్రిల్ 2025

'ఉపనయనాలకు హాజరుకావాలి'

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉపనయనాల కార్యక్రమానికి హాజరుకావాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల రామాలయంలో 21 మంది వటువులకు ఉచిత ఉపనయన సంస్కార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జయంత్‌కుమార్, రొట్ట సురేష్ శర్మలు తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

భూ భారతి చట్టం రైతులకు భరోసా కల్పిస్తుంది

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



ఆలూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన భూ భారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం భూ వివాదాలకు శాశ్వత పరిష్కారాన్ని చూపి రైతులకు భరోసా కల్పిస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ఆదివారం ఆలూర్ మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని రైతులకు నూతన చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భూభారతి చట్టం ద్వారా భూములపై పూర్తి యాజమాన్య హక్కులు రైతులకు లభిస్తాయని, భూహక్కుల భద్రతతో పాటు వివాదాల పరిష్కారానికి ఇది చరిత్రాత్మక మార్గదర్శకమని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నాలుగు మండలాలలో పైలెట్ ప్రాజెక్టుగా అమలవుతున్న ఈ చట్టం వచ్చేనెల మొదటివారం నుంచి

మిగతా 8వ పేజీలో...

జోరుగా వడ్డీ వ్యాపారం



- ఆస్తులను తనఖా పెట్టుకొని అప్పులు ఇస్తున్న వ్యాపారులు
- చెల్లింపులు ఆలస్యమైతే అధిక వడ్డీ పేరిట వసూళ్లు
- కట్టని వారి ఆస్తులను తమ పేరిట రాయించుకుంటున్న వ్యాపారులు
- పోలీసుల తనిఖీలతో వడ్డీ వ్యాపారుల్లో అలజడి
- నేతలను కలుస్తూ తనిఖీలను తప్పించుకునేందుకు జిల్లా వ్యాపారుల ప్రయత్నాలు



ఇటీవల బోధన్‌లో వడ్డీ వ్యాపారి ఇంటిపై దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

నిజామాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వడ్డీ వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. ప్రభుత్వ అనుమతులు లేకుండా.. రిజర్వు బ్యాంకు నిబంధనలు పాటించకుండా ఇష్టం వచ్చిన రీతిలో రుణాలు ఇవ్వడంతో పాటు వడ్డీ పేరిట పీక్క తింటున్నారు. అధిక వడ్డీలు వసూలు చేస్తూ రుణాలు తీసుకున్న వారిని నిత్యం వేధిస్తున్నారు. చివరకు ఆస్తులు అమ్ముకునే పరిస్థితిని కల్పిస్తున్నారు. కొంత మంది వడ్డీ వ్యాపారులు ముందుగానే రుణాలు తీసుకునే వ్యాపారుల ఆస్తులను సేల్ డీడీ పేరు మీద రాయించుకొని అప్పులను ఇస్తున్నారు. నిర్ణీత సమయంలో అప్పులు చెల్లించకుంటే అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు. ఇళ్లపైకి పంపి అరాచకాన్ని సృష్టిస్తున్నారు. చివరకు అన్ని రకాల ఒత్తిళ్లను పెంచడంతో పాటు ఆస్తులను స్వాధీ నం చేసు కుంటున్నారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు, ఇతర ఆస్తులను రుణం పేరు మీద రాయించు కుంటు న్నారు. కొంత మంది బంగారం, వాహనాలు తీసుకొని రుణాలను మంజూరు చేస్తున్నారు.

బ్యాంకులకు సమాంతరంగా వ్యాపారం

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులకు సమాంతరంగా ఈ వడ్డీ వ్యాపారం కొనసాగుతోంది. వడ్డీలు చెల్లించలేక జిల్లాలో కొంత మంది ఆస్తులను వదిలిపెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతుండగా మరికొంత మంది ఆత్మహత్యలకు కూడా పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. వడ్డీ వ్యాపారులపై కేసులు నమోదు అవుతున్నా తమకున్న పరపతిని ఉపయోగిస్తున్నారు. కొన్నిచోట్ల సెటిల్‌మెంట్లు చేసు కుంటుడగా మరికొంత మంది ఎన్ని కేసులైనా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. వీరికి నేతలు, అధికారుల అండదండలు ఉండటం వల్ల యథేచ్ఛగా ఈ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు.

మూడు దశాబ్దాలుగా వడ్డీ వ్యాపారం

జిల్లాలో మూడు దశాబ్దాలుగా వడ్డీ వ్యాపారం కొనసాగుతోంది. జిల్లా నుంచి దుబాయ్‌కి వెళ్లే వారు ముందుగా ఈ వడ్డీ వ్యాపారుల వద్దే డబ్బులు తీసుకొని వెళ్లేవారు. తీసుకున్న డబ్బులకు అనుగుణంగా బంగారాన్ని ఇచ్చేవారు. మొదట తక్కువ వడ్డీతో కొనసాగిన ఈ వడ్డీ వ్యాపారం ప్రస్తుతం ఎక్కువ మొత్తంలో వసూలు చేసే వరకు వెళ్లింది. జిల్లా పరిధిలో వందల సంఖ్యలో వడ్డీ వ్యాపారం చేస్తున్నారు. వీరిలో వ్యాపారులు, రాజకీయ పార్టీలకు చెందిన కిందిస్థాయి నేతలు, ప్రభుత్వ ఉద్యోగు లు, ఇతర వర్గాల వారు కూడా ఉన్నారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న వృత్తినిపుణులు కూడా ఈ వడ్డీ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

ఇటీవల పోలీసుల తనిఖీలు..

జిల్లాలో ఈ వడ్డీ వ్యాపారంపై నాలుగు రోజుల క్రితం పోలీసులు తనిఖీలను చేపట్టారు. ఈ తనిఖీలతో వ్యాపారుల్లో ఆందోళన మొదలైంది. కొంతమంది వ్యాపారులు ఇళ్లకు తాళాలు వేసి తనిఖీల సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లగా మరికొంత మంది డబ్బులను, ప్రామిసరీ నోట్లను తెలిసిన వారి వద్దకు తరలించి భద్రంగా ఉంచారు. కొంత మంది తమకు దగ్గరగా ఉన్న అధికారుల ద్వారా సమాచారం తెలుసుకుంటూ తనిఖీలను తప్పించుకున్నారు. ఒకేసారి ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు తనిఖీలు నిర్వహించడంతో వారిలో ఆందోళన మొదలైంది. అనధికారికంగా కోట్ల రూపాయలను వడ్డీ వ్యాపారం కింద తిప్పుతున్న వారు వ్యాపారులు, చిన్నస్థాయి నేతలు, ఉద్యోగులు కావడంతో వారు తమకున్న పరిచయాలకు ఆధారంగా నేతలతో మాట్లాడారు. తనిఖీలను తప్పించుకునే ప్రయత్నాలను మొదలు పెట్టారు.

జిల్లాలో 30 ఏళ్లుగా ఈ వ్యాపారం కొనసాగుతుండగా గడిచిన పదేళ్లుగా భారీగా పెరిగింది. నగరం లో వడ్డీ వ్యాపారం చేసేవారు వందల సంఖ్య లో ఉన్నారు. రోజుకు వడ్డీలు ఇస్తూ వసూలు చేసేవారితో పాటు నెలవారీగా వడ్డీలు ఇచ్చే వారు ఉన్నారు. వీరే కాకుండా ఇళ్లు కొనుగోలుకు, ఇతర అవసరాలకు లక్షల రూపాయలు వడ్డీలకు ఇచ్చే వ్యాపారులు ఉన్నారు. వీరంతా తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ వడ్డీ వ్యాపారం నిర్వహించేవారు ప్రధాన పార్టీలకు చెందిన కిందిస్థాయి నేతలు ఉన్నారు. వీరు వడ్డీ వ్యాపారానికి సంబంధించి ఏ ఇబ్బందులు ఎదురైనా ఆ పార్టీలకు చెందిన నేతలు వీరిని కాపాడుతున్నారు. పోలీసులు ఇతర అధికారుల నుంచి సహాయ సహకారాలు అందిస్తున్నారు. వడ్డీ వ్యాపారం నిర్వహించే వారికి న్యాయ సలహాలు ఇచ్చేవారు కూడా ఉన్నారు.

మూడు నుంచి ఇరవై శాతం వరకు వసూలు

వడ్డీకి డబ్బులు తీసుకున్న వారి నుంచి మూడు నుంచి ఇరవై శాతం వరకు వసూలు చేస్తు న్నారు. అవసరం బట్టి లక్షల్లో అప్పులు ఇచ్చిన వారు మొ దట మూడు నుంచి ఐదు శాతం వడ్డీకి ఇస్తున్నారు. నిర్ణీత సమయంలో చెల్లిం చని వారి నుంచి అధిక వడ్డీని వసూలు చేస్తున్నారు. వడ్డీలకు డబ్బులు ఇచ్చేవారు మొదట కొన్ని ప్రామిసరీ నోట్ల మీద సంతకాలు తీసుకుంటున్నారు. వడ్డీ తీసుకునే వారితో పాటు వారి బంధువులు కానీ స్నేహి తుల నుంచి కానీ షూరిటీ సంతకాలను తీసు కుంటున్నారు. అధిక మొత్తంలో డబ్బులు తీసు కునే వారి వద్ద నుంచి వారి ఆస్తులకు సం బంధించిన భూములు, ఇతర ఆస్తులను సేల్ డీడీ కింద తమ పేరుమీద చేసుకుంటున్నారు. ఆ తర్వాతనే డబ్బులను అందిస్తున్నారు. నెల నుంచి సంవత్సరంలోపు సమయం ఇస్తూ వసూలు చేస్తున్నారు. ఈ అప్పుల్లో అసలుతో పాటు వడ్డీ కలిపి తీసుకుంటున్నారు. వడ్డీ డబ్బులు చెల్లిం చకుంటే అధిక వడ్డీ వసూలు చేసేందుకు తమ అనుచరులను పంపిస్తున్నారు. ఇళ్ల వద్దకు వెళ్లి నయానా బయానా చెప్పి వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఒత్తిళ్లకు కూడా దిగుతున్నారు. నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లించని వారి ఆస్తులను జప్తు చేస్తున్నారు. ఈ వడ్డీ వ్యాపారుల ఒత్తిళ్లకు తట్టుకోలేక నిజామాబాద్‌కు చెందిన ఒక కుటుంబ సభ్యులు విజయవాడకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. అక్కడి పోలీసులు ఇక్కడి వడ్డీ వ్యాపారులపై కేసులను నమోదు చేశారు. సంవత్సరం క్రితం మరో వ్యాపారి ఒత్తిళ్ల కు తట్టుకోలేక ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు సభ్యులు బాసరకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారిపైన కూడా కేసులను నమోదు చేశారు. ఇవేకాకుండా వడ్డీ వ్యాపారులు చేసిన ఆగడాలపై నిజామా బాద్ నగరం పరిధిలో అన్ని స్టేషన్‌లో కేసులు కూడా నమోదు అయ్యాయి. నగరంతో పాటు ఆర్మూర్‌లో కూడా వడ్డీ వ్యాపారం ఎక్కువగా కొనసాగుతోంది. నిజామాబాద్‌కు భిన్నంగా ఆర్మూర్‌లో బంగారం పైన ఎక్కువగా డబ్బులను అప్పులుగా ఇస్తారు. నిర్ణీత సమయంలో డబ్బులు చెల్లించకుంటే బంగారాన్ని వ్యాపారులు జప్తు చేసుకుంటారు. ఆర్మూర్‌లో ఈ వ్యాపారం 40ఏళ్లకు పైగా కొనసాగుతోంది. కొంత మంది వ్యాపారులు దీనిపైనే ఎక్కువగా దృష్టిపెట్టి కొనసాగిస్తున్నారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలో ఎవరికి డబ్బులు అవసరమైనా వీరి వద్ద బంగారాన్ని పెట్టి తీసుకువెళ్తారు. అదే రీతిలో బోధన్ మున్సిపాలిటీ పరిధిలోనూ కొనసాగుతుంది. అక్కడ కూడా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారితో పాటు అవసరం ఉన్న వారు ఈ రుణాలను వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకుంటున్నారు. వీరు అవసరాల నిమిత్తం వడ్డీ వ్యాపారులు ఎక్కడ సంతకం చేయమన్న చేస్తున్నారు. తర్వాత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

వ్యాపారుల అప్రమత్తం

జిల్లా నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఒకేసారి పలు ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారుల ఇళ్లలో తనిఖీలు మొదలు పెట్టడంతో వారు అప్రమత్తం అయ్యారు. అధికార పార్టీకి చెందిన నేతలతో పాటు ఇతర నేతల సహకారాన్ని తీసుకున్నారు. తమపైన తనిఖీలు జరగకుండా చూడాలని కోరారు. మరికొంత మంది వ్యాపారులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. కొంత మంది లక్షల నుంచి కోట్ల వ్యాపారం నిర్వహిస్తున్నందున దొరికితే కేసులు నమోదు కానుండటంతో తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్నిచోట్ల నేతలు కూడా వారికి సహకారం అందిస్తున్నట్లు తెలుస్తోంది. కిందిస్థాయి అధికారులను కూడా చూసి చూడనట్లు ఉండాలని కోరుతున్నట్లు సమచారం. అయితే వడ్డీ వ్యాపారంపై కమిషనర్ సీరియస్‌గా ఉండటం వల్ల కిందిస్థాయి అధికారులు కూడా వారికి సహకరించే పరిస్థితుల్లో లేరు. జిల్లాలో అన్ని చోట్ల పోలీసులు తనిఖీలను నిర్వహిస్తే భారీ ఎత్తున పట్టుబడే అవకాశం ఉంది.

వక్ఫ్‌బిల్లును ఎట్టిపరిస్థితుల్లో అమలు కానివ్వం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్
- వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా నగరంలో భారీ ర్యాలీ



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎట్టి పరిస్థితుల్లోనూ వక్ఫ్‌బిల్లును అమలు కానివ్వబోమని, చట్టప్రకారం కోర్టుల ద్వారా బిల్లును అడ్డుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్‌అలీ షబ్బీర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బోధన్‌రోడ్డులో వక్ఫ్‌బోర్డు బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. వక్ఫ్‌బోర్డు చట్టాన్ని సవరిం చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వక్ఫ్ ఆస్తులను ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకుని ముస్లిం మైనార్టీ సమాజాన్ని బలహీన పర్చేలా కేంద్రం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. వక్ఫ్‌బోర్డు చట్టసవరణను వెంటనే ఉపసంహరిం చుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో సొంత ఖర్చులతో పిటిషన్ దాఖలు చేశానన్నారు. వక్ఫ్‌బిల్లు చట్టబద్ధతపై సుప్రీం కోర్టులో విచారణ మొదలు పెట్టిందని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూ వివరణ కోరిందన్నారు. ఈ కేసును ప్రముఖ న్యాయవాదులు కపిల్ సిబాల్, సల్మాన్ ఖుర్షీద్ బృందం వాదిస్తుందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం 2025 చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సర్వోన్నత న్యాయస్థానం విచారణ బుధవారం ప్రారంభించిందన్నారు. సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌లతో కూడిన ధర్మాసనం పిటిషన్లపై విచారణ చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జావీద్ అక్తర్, ఖుద్దుస్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్లకార్డును చూపిస్తున్న తాహెర్‌బిన్ హుందాన్



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గిరిరాజ్‌లో రైతు మహోత్సవం కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

నేటి నుంచి గిరిరాజ్‌లో రైతు మహోత్సవం

- మూడు రోజులపాటు కొనసాగనున్న కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని గిరిరాజ్ కళాశాలలో సోమవారం నుంచి మూడు రోజులపాటు రైతు మహోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రారంభించనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవ కార్యక్రమానికి భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. జిల్లాతోపాటు ఇతర జిల్లాల రైతులు హాజరయ్యే విధంగా స్టాల్స్ ఏర్పాటు చేసారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల స్టాల్‌లతో పాటు ఉద్యానవన, మత్స్య, పట్టుపరిశ్రమ, పాడి పరిశ్రమ శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేశారు. గిరిరాజ్ కళాశాలలోని స్టాల్స్‌ను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పరిశీలించారు. మూడు రోజులపాటు జరిగే ఈ సమావేశంను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేళాలో ఆధునాతనమైన పరికరాలతో పాటు కొత్త వంగడాలను కూడా రైతులకు పరిచయం చేస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు మహోత్సవం కార్యక్రమానికి ఎక్కువ మొత్తంలో ప్రజలు హాజరు టకావాలని ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్ బిన్ హుందాన్ తెలిపారు. ఈ స్టాల్స్‌ను రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ కూడా పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని పకడబ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

భాషా పండితుల 30 ఏళ్ల కలను సాకారం చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న భాషా పండితుల 30ఏళ్ల కలను సాకారం చేసిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్‌అలీ షబ్బీర్ అన్నారు. ఆదివారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్రప్రభుత్వ కృతజ్ఞత సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అధికారం రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నామన్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తామన్నారు. మిగిలిపోయిన 700 మంది భాషా పండితులను ఎస్ఏగా పదోన్నతులుగా కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. 317ఉత్తర్వుల ద్వారా నష్టపోయిన స్కూల్ అసిస్టెంట్ (భాషలు) స్పౌస్ బదిలీలు జరిగే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, డీఈవో అశోక్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి క్రాంతికృష్ణ, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ జలీల్ ఉల్లా, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రమణచారి పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చరిత్రాత్మక నిర్ణయం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం ఒక చరిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్‌అలీ షబ్బీర్ అన్నారు. ఆదివారం నగరంలోని 17వ డివిజన్ పూలే అంబేద్కర్‌నగర్ కాలేనీలో దళిత లబ్ధిదారుని ఇంట్లో సహపంక్తి భోజ నం చేశారు. ఈ పథకం పేద ప్రజల కడుపు నింపడానికేనని అన్నారు. ఇందులో 80శాతానికిపైగా బడుగు, బలహీన, దళిత, గిరిజన మైనార్టీ లబ్ధి పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో దారిద్ర్య రేఖ దిగువన ఉన్న నిరుపేద లందరికీ పూర్తిస్థాయిలో ఆహార భద్రత కల్పించేందుకే సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ పథకం అమలు పరిచేందుకు అధికారులు చొరవచూపాలన్నారు. సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలు జరపవద్దని, గోదాముల నుంచి బియ్యం రవాణా అయ్యి రేషన్ షాపుల ద్వారా లబ్దిదారులకు వెళ్లేంతవరకు లోటుపాట్లు ఉంటే సరిచేసుకోవాలన్నారు. ప్రజల నుంచి ఈ పథకంపై ఏమైనా పిర్యాదులు వస్తే అధికారులు సత్వ రమే పరిష్కరించాలన్నారు. పథకం అమలులో ఎక్కడైనా అవకతవకలు జరిగే సహించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 13వేల కోట్లు వెచ్చించి 30లక్షల టన్నుల సన్నబియ్యాన్ని పేదలకు అందిస్తున్నామన్నారు. ఆయన వెంట రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నూడా చైర్మన్ కేశవేణు, కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రత్నాకర్, జావీద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కుర్మసంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరంలోని పట్టణ కుర్మ సంఘం కమ్యూనిటీ హాల్‌ను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్‌అలీ షబ్బీర్ ప్రారంభించారు. ఆదివారం నగరంలోని పులాంగ్ రోడ్డులో గల కమ్యూనిటీ హాల్ ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కుర్మ సంఘం అధ్యక్షులు, నూడా చైర్మన్ కేశవేణు, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, తాహెర్‌బిన్ హుందాన్, గడుగు గంగాధర్, రత్నాకర్, నగేష్ రెడ్డి, ముప్ప గంగారెడ్డి, కుర్మ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నాకుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది

● నాతో రాజకీయం చేయి.. కుటుంబ సభ్యులతో కాదు: బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆరోపణ

బోధన్‌రూరల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం నా కుటుంబంపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహసభ సందర్భంగా బోధన్ బీఆర్ఎస్ కార్యకర్తలతో సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే ఇచ్చిన హామీలను అమలు చేయడం పక్కన పెట్టి అభివృద్ధిపై దృష్టి సారించకుండా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. తనపై సైతం లేనిపోని కేసులు జోడించి వేధిస్తున్నారని తన కుమారుడిపై కావాలని కేసులు పెట్టించి అనవసరమైన రాద్ధతం చేస్తున్నారని, ప్రభుత్వం భయభ్రాంతులకు గురి చేస్తుందని ఆరోపించారు. దుబాయ్‌కి ఆరోగ్య సమస్యల వల్ల బోధన్ కార్యకర్తలకు దూరమయ్యాయని పేర్కొన్నారు. తనకు ఆరోగ్యం బాగా లేకనే బోధన్‌కు రాలేకపోయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాని కాంగ్రెస్ నాయకులు అనవసరమైన పుకారలను తనపై సృష్టించారని ఆరోపించారు. తన కుటుంబాన్ని మానసికంగా వేధించేందుకు తప్పుడు కేసులు పెట్టి 200మంది పోలీసులను తన ఇంట్లోకి పంపించారని ఆరోపించారు. చిన్న పిల్లలను, మహిళలను చూడకుండా ఒక ఉగ్రవాది కంటే ఘోరంగా తన పట్ల ప్రవర్తించారని ఉద్వేగానికి గురయ్యారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నీకు దమ్ముంటే నాతో రాజకీయం చేయాలని, చిన్న పిల్లలతో, కుటుంబ సభ్యులతో నీచ రాజకీయం చేయడం సరికాదన్నారు. పీడీఎస్ బియ్యం ఎలాంటి అవకతవకలు జరగలేదని అనవసరంగా నన్ను బద్నామ్ చేస్తున్నారన్నారు. తన తల్లి ఇటీవల మరణించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కనీసం ఫోన్ చేసి పరామర్శించలేదని ఇదేనా మానవత్వపు రాజకీయం అని ఆయన ప్రశ్నించారు. రైస్‌మిల్లుల్లో రూ.7కోట్ల బకాయిలు చెల్లించాలని నోటీసులు వచ్చాయని, దీనిపై నేను న్యాయపరంగా పోరాడుతానని ప్రభుత్వానికి ఎంత సొమ్ము ఇచ్చేది ఉన్న కట్టేస్తానని పేర్కొన్నారు. ఇలాంటి నీచ రాజకీయాలు చేస్తూ కేసులు పెడితే తాము భయపడామని తెలంగాణ ఉద్యమ సమయంలో తమపై వందల కేసులు అయ్యాయని గుర్తు చేశారు. 10సంవత్సరాల బీఆర్ఎస్ పాలనకు 18నెలల కాంగ్రెస్ పాలనను ప్రజలు చూస్తున్నారని, తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుని అవకాశం ఇస్తే అధ్వానంగా పరిపాలన కొనసాగిస్తున్నారని తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. సుదర్శన్ రెడ్డి వైఖరితో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైతం అయోమయంలో ఉన్నారని విమర్శించారు.



బోధన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

● రజతోత్సవ మహా సభను విజయవంతం చేయాలి

ఈ నెల 27వ తేదిన వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగే రజతోత్సవ మహసభలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే షకీల్ బోధన్ నియోజకవర్గ కార్యకర్తలను కోరారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఏర్పడిన నాటి నుండి తెలంగాణలో అనేక ఉద్యమాలు చేపడుతూ దేశంలోనే అగ్రగామిగా బీఆర్ఎస్ పార్టీ నిలబడిందని ఆయన పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు, నాయకులు సకాలంలో అధిక సంఖ్యలో మహసభకు తరలే విధంగా సన్నద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, గిర్దావర్ గంగారెడ్డి, నర్సింగ్ రావు, శ్రీనివాస్, శ్రీరామ్, రజాక్, సంజీవ్ కుమార్, గోగినేని నర్సయ్యలతో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బినోలలో బోనాల పండుగ



బోనమెత్తిన గ్రామస్థులు

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. స్థానిక ముత్యాలమ్మ ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులు బోనాలను తలపై పెట్టుకుని ఆలయానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించి పాడిపంటలు చల్లగా ఉండాలని కోరుతూ మొక్కులు సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పురోహితులు కృష్ణప్రసాద్ జోషి, గ్రామస్థులు భక్తులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ టీమ్ దాడి

● 11మంది పేకాట రాయుళ్ల అరెస్టు ● రూ.31,460 స్వాధీనం

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ శివారులోని పంట పొలాల్లో పేకాట ఆడుతున్న వారిపై ఆదివారం రాత్రి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 11మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుండి ఆరు ద్విచక్ర వాహనాలు, 10సెల్‌ఫోన్‌లతో పాటు రూ.31,460లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తదుపరి చర్య నిమిత్తం వారిని నవీపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ ఇన్స్‌స్పెక్టర్ అంజయ్య, ఎస్ఐ గోవింద్, సిబ్బంది ఉన్నారు.

కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల రోడ్డు సేఫ్టీ ఛాంపియన్ అవార్డుకు ఎంపిక



హైదరాబాద్‌లో అవార్డు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

కోటగిరి,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల రోడ్డు సేఫ్టీ ఛాంపియన్ అవార్డుకు ఎంపికైంది. గత రెండు నెలల క్రితం పాఠశాలలో సర్వేజన ఫౌండేషన్ నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాల రోడ్డు సెఫ్టీ చాంపియన్ అవార్డుకు ఎంపికైంది. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర డీజీపీ జితేందర్ చేతుల మీదుగా పాఠశాల ఉపాధ్యాయులు బర్ల సాయిలు, ఎండీ అతిక్ అవార్డును అందుకున్నారు. పాఠశాల అవార్డుకు ఎంపిక కావడం పట్ల కోటగిరి ఎంఈవో శ్రీనివాస్ రావు హర్షం వ్యక్తం చేశారు.

గోదావరి నదిపై చురుకుగా కొనసాగుతున్న వంతెనల నిర్మాణం

● రోడ్డు బ్రిడ్జి పనులు దగ్గర పడగా.. కొనసాగుతున్న రైల్వే బ్రిడ్జి పిల్లర్ల పనులు



యంచ వద్ద కొనసాగుతున్న మరో రైల్వే బ్రిడ్జి పిల్లర్ల నిర్మాణ పనులు



చురుగ్గా సాగుతున్న పిల్లర్ నిర్మాణపు పనులు

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ గోదావరి నదిపై రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులు, రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. సంగారెడ్డి నుండి మహరాష్ట్రలోని అకోల వరకు చేపట్టిన 161జాతీయ రహదారి నిర్మాణ పనులలో భాగంగా కామారెడ్డి జిల్లా మద్నూర్ నుండి బోధన్ వరకు 161 బీబీ మొదటి ఫేస్, బోధన్ నుండి నిర్మల్ జిల్లా భైంసాకు రెండవ ఫేస్ నిర్మాణ పనులను కేంద్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల క్రితం మంజూరు చేసింది. దీనిలో భాగంగా రోడ్డు విస్తరణల పనులు దాదాపుగా పూర్తి కాగా యంచ గోదావరి నదిపై రోడ్డు బ్రిడ్జి నిర్మాణ పనులు సైతం దగ్గర పడ్డాయి. అలాగే దక్షిణ మధ్య రైల్వే మేడ్చల్ నుండి మహరాష్ట్రలోని ముఖేడ్ వరకు రైల్వే డబ్లింగ్ పనులు మంజూరు కాగా మండలంలోని మహంతం నుండి బాసర వరకు రైల్వే డబ్లింగ్ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న రైల్వే బ్రిడ్జి పక్కన మరో రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి పిల్లర్ల పనులు కొనసాగుతున్నాయి. గోదావరి నదిపై నిర్మిస్తున్న రోడ్డు, రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులు పూర్తయితే పొరుగున ఉన్న నిర్మల్ జిల్లాతో పాటు మహరాష్ట్రలో ఉన్న పలు ప్రాంతాలకు రాకపోకలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి.



యంచ గోదావరి నదిపై సాగుతున్న పనులు

కెరీర్ గైడెన్స్ విద్యార్థుల భవిష్యతుకు ఉపయోగకరం



ఆర్మూర్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): కెరీర్ గైడెన్స్ విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగకరమని క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు రిటైడ్ ఐజీపీ డాక్టర్ విశ్వనాథ రవీందర్ అన్నారు. ఆదివారం ఆర్మూర్‌లోని క్షత్రియ కళ్యాణమండపంలో పెర్కిట్, మామిడిపల్లి, ఆర్మూర్ క్షత్రియ సమాజ్ సభ్యుల సౌకర్యార్థం కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. విశ్వనాథ్ నవీన్ మాట్లాడుతూ విద్యార్థులకు కోర్సుల గురించి వివరించారు. వివిధ కోర్సుల ప్రాముఖ్యత, అవకాశాలపై విశ్లేషనాత్మకంగా వివరించారు. కోర్సుల వివరాలను ఎల్ఈడీ స్క్రీన్‌పై పదర్శిచి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సమాజ్ అధ్యక్షుడు రెడ్డి ప్రకాష్, కార్యదర్శి పడాల గణేష్, క్షత్రియ ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, జీవి ప్రశాంత్, పండిత్ ప్రేమ్, పండిత్ పవన్, రాజ్‌కుమార్, కర్తన్ దినేష్, గంగామోహన్, అల్జపూర్ లక్ష్మీనారాయణ, సంతాని విజయ్, జెస్సు అనిల్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

● ఒకరికి గాయాలు



మృతిచెందిన బాలుడిని మార్చ్యురీకి తరలిస్తున్న ఎస్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ 44వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్ బాలురు ఓంకార్(14), భానుప్రసాద్ (11)లు మృతిచెందగా విశ్వనాథ్ అనే ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అశోక్‌నగర్‌కు చెందిన బంజ విశ్వనాథ్ పెర్కిట్ లోని ఒక వివాహ కార్యక్రమానికి తన కుమారుడు ఓంకార్ అతడి స్నేహితుడు భానుప్రసాద్‌లను బైక్‌పై తీసుకొని బయల్దేరాడు. పెర్కిట్ 44వ జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా నిర్మల్ నుండి వస్తున్న లారీ బైక్‌ను డీ కొట్టింది. దీంతో భానుప్రసాద్ అక్కడిక్కడే మృతి చెందగా గాయాలపాలైన తండ్రి కొడుకులైన విశ్వనాథ్, ఓంకార్‌లను పోలీస్‌లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓంకార్ మృతిచెందాడు. తీవ్రగాయాలపాలైన విశ్వనాథ్‌ను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశ్వనాథ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నవీపేటకు చెందిన సాయితేజ అనే యువకుడిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వినయ్ తెలిపారు. తన మొబైల్ ఫోన్‌లో ఆన్‌లైన్ ఐపీఎల్‌కు సంబంధించిన బెట్టింగ్ ఆడడంతో పాటు నిజామాబాద్‌కు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తితో ముఠాగా ఏర్పడి అతనికి మధ్యవర్తిగా పని చేసేవాడని ఎస్ఐ పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన యువకులకు బెట్టింగ్ పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి వారికి సంబంధించిన డబ్బులను సాయితేజ ఇమ్రాన్‌కు పంపించే వాడని అన్నారు. సాయితేజ బెట్టింగ్ ఆడే యువకులకు ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చే వాడని దీంతో చాలా మంది యువకులు బెట్టింగ్‌లో డబ్బులు కట్టి నష్టపోయ్యారని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ విషయంపై కేసు నమోదు చేయగా నిందితుడి సాయితేజను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని, మరో నిందితుడు ఇమ్రాన్ పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు.

చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ముప్కాల్‌లో రజతోత్సవ బహిరంగా సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ముప్కల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):ఈనెల 27వ తేదీన తలపెట్టిన చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముప్కాల్ మడల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావించి 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా వరంగల్‌లో నిర్వహించనున్న 25వ రజతోత్సవ బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా రజతోత్సవ బహిరంగ సభ వాలపోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతుడి ఫొటో

మాక్లూర్,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి గ్రామంలో భిక్షాటన చేస్తూ కాలం వెళ్లదీస్తున్న గుర్తు తెలియని వ్యక్తి గత మూడు రోజు లుగా గుడిలో అనారోగ్యంతో ఉండడం గమనించిన గ్రామ స్థులు చికిత్స నిమి త్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికి త్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మర ణించిన వ్యక్తిని ఎవరైన గుర్తు పట్టినచో మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదిం చాలని ఆయన కోరారు.

మాదిగ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):మాదిగ ఉద్యోగుల సమైఖ్య నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నూత్‌పల్లి మారుతి, సంకెపల్లి గంగాధర్‌లు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధి కారిగా ఇందూరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా బాబా శ్రీనివాస్, అడిషనల్ జనరల్ సెక్రెటరి గద్దల రమేష్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్, జాతీయ నాయకులు తెడ్డు గంగారాం, రేణికుంట నాం పల్లిలు వ్యవహరించారు. వీరితో పాటు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు నూత్‌పల్లి మారుతి మాట్లాడుతూ మాది గల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని‌అన్నారు.నూతన కార్యవర్గం ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర కమిటీ నాయకులు దేవేంద్రప్రసాద్, యాదగిరి, సురేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నాంపల్లి, తెడ్డుగంగారాం, ప్రమోద్, భూషణ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

బర్దిపూర్ చర్చిలో ఈస్టర్ వేడుకలు

.డిచ్‌పల్లి,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బర్దిపూర్ సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలు క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. చర్చి ఫాదర్ దినాకర్ ఆధ్వర్యంలో ఉదయం 4గంటల నుంచి స్త్రీల మైత్రి కార్యక్రమంలో భాగంగా సూర్యోదన ఆదరనలో సంఘ కాపారి క్రీస్తు మరణం గురించి దినాకరణ్ వివరించారు. ఈ సందర్భంగా స్త్రీలు ప్రత్యేకమైన గీతనాలు, ఆలంపించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు కులపెద్దలు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ ఎన్నిక



కిసాన్‌నగర్‌లో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

బాల్కొండ ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):బాల్కొండ మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కొండ అశోక్, ఉపాధ్యక్షులుగా ఐలా పూర్ శ్రీని వాస్, కోశాధికారిగా ఆడెపు రవీందర్, ప్రధాన కార్యదర్శిగా శివ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో వీడీసీ సభ్యులు హనుమంతు, నాగభూషణం, అమర్నాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాణంపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం



రాణంపల్లిలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): రుద్రూరు మండలంలోని రాణంపల్లి గ్రామంలో కావేరి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో భవన నిర్మాణ కార్మికులతో పాటు స్థానికులకు బీపీ, షుగర్‌తో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావేరి ఆసుపత్రి వైద్యులు రోహిత్, మేనేజ్‌మెంట్ కరుణాకర్, శ్రీధర్, వినోద్, కార్మిక సంఘం నాయకులు మల్లేష్, బుజ్జి స్వామి, నాగేష్, అశోక్, ప్రవీణ్, మీరా, రాజు, లాలయ్య, కాశీం తదితరులు పాల్గొన్నారు.

రేపు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

బాల్కొండ,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన భూభారతి ఆర్ఓఆర్ చట్టం 2025పై అవగాహన కార్యక్రమం ఈ నెల 22న బాల్కొండ మండల కేంద్రంలోని ఎంకె గార్డెన్‌లో సాయంత్రం 4గంటలకు జిల్లాకలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ అప్ప శ్రీధర్ తెలిపారు. ఈకార్యక్రమానికి మండల పరిధిలోని రైతులు, ప్రజలు హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

ధర్పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భూభారతిపై అవగాహన కల్పించడానికి నేడు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు ధర్పల్లి తహసీల్దార్ మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. ధర్పల్లి గ్రామంలోని రైతు వేదికలో మధ్యాహ్నం 2.30 గంటలకు సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు హాజరుకా నున్నారని తెలిపారు. ఈ సభకు పెద్దసంఖ్యలో రైతులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

పగలే వెన్నెలాయే..

● డిచ్‌పల్లి-నిజామాబాద్ ప్రధాన రోడ్డుపై విద్యుత్ లైట్ల పరిస్థితి ● పట్టించుకోని నుడా అధికారులు



నడిపల్లి శివారులో పట్టపగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు

డిచ్‌పల్లి,ఏప్రిల్20 (ఆంధ్రజ్యోతి):డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ ప్రధాన రోడ్డుపై ఉన్న సెంట్రల్ లైటింగ్ లైట్లు వెలగడం లేదు. గత నెల రోజులుగా ఈ లైట్లు రాత్రి సమయంలో పూర్తి స్థాయిలో వెలగకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విచిత్రమేమం టే అక్కడక్కడ కొన్ని లైట్లు పగటి సమయంలో మాత్రము వెలుగుతు రాత్రి సమయంలో వెల గడం లేదు. విద్యుత్ లైట్ల మెంటిన్స్ సరిగా లేక ఈలైట్లు వెలగటం లేదని వాహనదారులు పేర్కొంటున్నారు. లైట్లు వెలగకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు భారిన పడుతు న్నారు. నుడా (నిజామాబాద్ అర్బన్ డెవలప్‌మెం ట్ అథారిటీ) అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతోనే ఈ సమస్య ఎదురవు తుందని వెంటనే విద్యుత్ లైట్లు వెలిగేల చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. పన్నులు వసూళ్ల తీసుకునే నుడా గ్రామాల లో ఉన్న సౌకర్యాలను నిర్లక్ష్యం చేయడం సరికాదని వాహనచోదకులు పేర్కొంటున్నారు.

● నుడా పనితీరుపై విమర్శలు

నుడా ఆధ్వర్యంలో కొనసాగుతున్న డిచ్‌పల్లి-నిజామాబాద్ రోడ్డు మధ్యలో పెంచిన మొక్కలకు కనీసం నీరు అందించక పోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. ఎండలు మండిపోతుండటంతో మొక్కలు ఎంపిపోతున్నాయి, మొక్కలకు నీటిని అందించి పచ్చదనాన్ని కాపాడాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

శివనామ స్మరణతో సకల శుభాలు

బోధన్‌రూరల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): శివనామ స్మరణతో ముక్తి, సకల శుభాలు కలుగుతాయని సద్గురు 108షడ్‌బ్రాహ్మ శ్రీశ్రీ దీన్‌దయాల్ శివాచార్య మహరాజ్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాయ ఆలయ ప్రాంగణంలో అఖండ 20వ శివనామ సప్తాహ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనామ స్మరణతో సకల శుభాలు కలుగుతాయని ఆయన సూచించారు. భక్తులు సన్మార్గంలో నడవాలని సూచించారు. భక్తిమార్గంలో నడిస్తే ముక్తి లభిస్తుందని పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుంకిని మహరాజ్ సిద్ద లింగాప్ప, బాబయప్ప, వెంకటేశ్వర్ రావు దేశాయ్, నర్సింగ్ అప్పా, శ్యామ్‌రావు, శివకుమార్ అప్పా, కైలాస్ అప్పా, పురాణే అజయ్‌కుమార్, లక్ష్మణ్ రావు పటేల్, మాధవరావు తదితరులున్నారు.



భజన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



మాక్లూర్‌లో చెక్కుల అందజేస్తున్న దృశ్యం

మాక్లూర్,ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మాక్లూర్ గ్రామానికి చెందిన బొబ్బిలి సత్తెమ్మ అనే మహిళకు రూ. 12వేలు, కృష్ణానగర్ గ్రామానికి చెందిన నాగేశ్వర్‌కు రూ. 60వేలు సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశ్వరావు అందజేశారు. ఇటీవల వారు అనారోగ్యానికి గురికావడంతో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి చొరువతో ఇట్టి చెక్కులను అందజేనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జాబర్, అలీం, స్వామి, జైల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీనగర్ కాలనీలో చోరీకి విఫలయత్నం

నవీపేట,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివాజీ నగర్ కాలనీలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి విఫలయత్నం చేశాడు. అర్ధరాత్రి సమయంలో కాలనీలో ఉండే ఓ మహిళ తన ఇంటి ఆవరణలో ఉన్న బాత్‌రూమ్ వైపు వెళ్తుండగా ముఖానికి టవాల్ చుట్టుకున్న గుర్తు తెలియని దుండగుడు మహిళ మెడ, నోటిని గట్టిగా పట్టుకున్నాడు. దీంతో ఆమె భయంతో కేకలు వేయడంతో దుండగుడు పారిపోయాడు. వెంటనే అప్రమత్తమైన ఆమె 100కాల్ చేయడంతో పోలీసులు బాధితురాలి ఇంటికి చేరుకుని విచారణ జరిపారు. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ని వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.


ఎల్లమ్మతండా వద్ద బృహత్ ప్రకృతి వనంలో కాలిపోయిన మొక్కలు


బృహత్ ప్రకృతి వనంలో చెడిపోయిన బోరుమోటారు


బృహత్ ప్రకృతివనంలో నాడు ఏపుగా పెరిగిన మొక్కలు (ఫైల్)

జీవం కోల్పోతున్న పల్లెప్రకృతి వనాలు!

● బృహత్ ప్రకృతి వనానికి నిప్పు ● కాలిపోయిన మొక్కలు ● పట్టించుకోని అధికారులు

లింగంపేట, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పల్లె ప్రకృతి వనాలు జీవం కోల్పోతున్నాయి. ప్రజలు సేద తీరేందుకు.. వృద్ధులు, ప్రకృతి ప్రేమికులు వాకింగ్ చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చుచేసి ప్రతీ పల్లెలోనూ ప్రకృతివనాలను ఏర్పాటుచేసింది. ఒక్కో ప్రకృతివనంలో వేల ల్లో మొక్కలు నాటారు. వాటిని కాపాడేందుకు ఉపాధిహామీ పథకంలో ఒక కూలీని నియమించారు. అందమైన మొక్కలతోపాటు పూల మొక్క లను, వృక్షాలను అందులో నాటారు. కొంతకాలం క్రితం కొంతవరకు బాగానే ఉన్నాయి. కొన్నిగ్రామాల్లో సాయంకాలం వేల వృద్ధులు, ఇతరులు ప్రకృ తివనాలలోకి వచ్చి సేదతీరే వారు పండుగలు, ఇతర ఉత్సవాల సందర్భం గా గ్రామస్థులు ప్రకృతి వనంలోకి వచ్చి భోజనాలు చేసి ఆడుకునేవారు. కానీ నేడు అవి కొన్ని గ్రామాల్లో పూర్తిగా పాడయ్యాయి. కొన్ని గ్రామా ల్లో కొంతవరకు చెట్లు ఉన్నాయి. పూలచెట్లు, అందమైన చెట్లు ఎండి పోయాయి. రూ.లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ప్రకృతి వనాలు ఇలా ఆదరణ లేక ఎండిపోయి పాడవుతున్నా యని మండల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని ఎల్లమ్మ తండా వద్ద ఎల్లారెడ్డి - కామారెడ్డి రహదారి పక్కన వాహనదారులకు సేద తీరేందుకు, 10 ఎకరాలలో బృహత్ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశా రు. అందులో 30వేల మొక్కలను నాటారు. మొక్కలను కాపాడేందుకు బోరువేసి ప్రకృతివనం చుట్టూ పైప్‌లైన్ వేశారు. వీటన్నింటికీ రూ.10 లక్షల వరకు ఖర్చుచేశారు. అంతలోనే సర్పంచ్‌ల కాలపరిమితి పూర్తికావ డంతో ప్రకృతి వనాలను పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారుల పర్యవేక్షణ లేక బోరుమోటరు చెడి పోవడంతో మొక్కలకు నీటిని పట్టే నాథుడు కరువయ్యాడు. మొక్కలు వాడిపోయి ఎండిపోయాయి. ప్రజల కు పచ్చదనాన్ని ఇవ్వాల్సిన బృహత్ ప్రకృతివనాన్ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు స్థలా న్ని కబ్జా చేసేందుకు నిప్పంటించారు. అగ్నికి ఆహుతి అయ్యింది. పచ్చని మొక్కలతోపాటు, ఏపుగా అందంగా పెరిగి నీడను ఇచ్చే చెట్లు సైతం అగ్గిలో కాలిబూడిదయ్యాయి. బోరు మోటరుచెడిపోయి నెలలు గడుస్తున్నా దాన్ని పట్టించుకున్నవారు లేరు. దీంతో బోరు మోటా రు బోరులోనే ఇరుక్కు పోయింది. మొక్కలు కాలిపోయాయి. ప్రభుత్వ లక్ష్యం, ప్రజల ఆశలు నెరవేరకుండానే ప్రజా ధనం వృధా అయ్యిందని మండల ప్రజలు అంటున్నారు. మండలంలోని అనేకగ్రామాల్లో పల్లెప్రకృ తి వనాల పరిస్థితి ఇలాగే ఉందని గ్రామాలలో పంచాయితీ కార్యదర్శులు పట్టిం చుకోవడం లేదని ఏమిటని ఎవరైనా అడిగితే పంచాయతీలో డబ్బులు లేవని చెబుతున్నారని అంటున్నారు. ప్రకృతివనాలను కాపాడేం దుకు, హరితహారంలో నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీకి వాటర్ ట్యాంకర్ కొనుగోలు చేసింది. కానీ పం చాయతీ కార్యదర్శులు పంచాయతీలలో డబ్బులు లేవనే సాకుతో ఇవేవి పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికై నా జిల్లాస్థాయి అధికారులు స్పందించి గ్రామీణ ప్రజలకు పచ్చదనాన్ని అందించే ప్రకృతి వనాలను, ఎల్లమ్మ తండాలో ఏర్పాటు చేసిన బృహత్ ప్రకృతి వనాన్ని కాపాడాలని మండల వాసులు కోరుతున్నారు.



కొత్త మొక్కలు నాటిస్తాం

● నరేష్ ఎంపీడీవో

బృహత్ ప్రకృతి వనంలో కాలిపోయిన మొక్క ల స్థానంలో వర్షాకాలంలో కొత్త మొక్కలు నాటి స్తాం. చెడిపోయిన బోరు మోటారును తిరిగి రిపేరు చేయిస్తాం. పోలీసులకు ఫిర్యాదు చేశాం. ప్రకృతి వనాన్ని కాపాడుతాం.


మొక్కలకు నీటిని పట్టేందుకు నాడు ఏర్పాటు చేసిన బోరుమోటరు (ఫైల్)

ఫటా..ఫట్...

వేసవిలో గర్భిణులు జాగ్రత్తలు పాటించి ఎండల నుంచి ఉపశమనం పొందాలి

● కమ్మర్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హసీనా



కమ్మర్‌పల్లి, ఏప్రిల్20. (ఆంధ్రజ్యోతి): వేసవి లో గర్భిణులు తగు జాగ్రత్తలు తీసుకుంటు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందాలని క మ్మర్‌పల్లి పీహెచ్‌సీ మెడికల్ అఫీసర్ డాక్టర్ డాక్టర్ హసీనా అన్నారు

ఆంధ్రజ్యోతి: ఎండల నుంచి రక్షణకు గర్భి ణులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్: గర్భిణులు ఎండలో తిరగొద్దు. తప్ప నిసరి అనుకుంటే తలపై తెల్లగుడ్డ కప్పుకోవాలి. శరీరానికి తెల్లదుస్తులు మాత్రమే ధరించాలి.

ఆంధ్రజ్యోతి: ఎండలో తిరిగితే ఎలాంటి పరిణామాలు ఎదురవుతా యి?

డాక్టర్: ఎండలో తిరిగితే శరీంలోని లవణాలు చెమటరూపంలో బపట కు వచ్చి నీరసంతో పాటు జ్వరం వస్తుంది.

ఆంధ్రజ్యోతి: ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

డాక్టర్: చెమట రూపంలో బైటకు వచ్చిన లవణాలు తిరిగి మన శరీ రంలో నిలువ ఉండడానికి ద్రవ పదార్థాలను ఎక్కువగా సేవించాలి.

ఆంధ్రజ్యోతి: ఎలాంటి ద్రవపదార్థాలు తీసుకోవాలి?

డాక్టర్: కొబ్బరినీళ్లు, గంజి, నిమ్మరసం, అంబలి, మజ్జిగలాంటి ద్రవప దార్థాలు సూవిస్తూ అధిక మోతాదులో నీళ్లు తాగాలి.

ఆంధ్రజ్యోతి: గర్భిణులు ఓఆర్ఎస్ సేవించవచ్చా?

డాక్టర్: గర్భిణులు ఓఆర్ఎస్ సేవించవచ్చు. ఆసుపత్రి పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలలో ఉందుబాటులో ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: గర్భిణులు ఏలాంటి పండ్లు తీసుకోవాలి?

డాక్టర్: దానిమ్మ, ఖర్బూజ, కిరదోస, బీట్‌రూట్, క్యారెట్ లాంటి పండ్లు, వాటి జూస్ తీసుకోవచ్చు.

ఆంధ్రజ్యోతి: వేసవిలో గర్భిణులు రోజువారి ఎన్ని లీటర్ల నీళ్లు తాగా లి?

డాక్టర్: గర్భిణులు ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు ప్రతీ రోజు 6 నుంచి 8 లీటర్ల నీరు తాగాలి. మధ్యాహ్నం బపటకు రాకుండ విశ్రాంతి తీసుకోవాలి. బయటకు వెళ్లాల్సి వస్తే ఉదయం, సాయంత్ర వేళల్లో మాత్రమే వెళ్లాలి.

ఆంధ్రజ్యోతి: ఇంకా తీసుకోవాలసిన జాగ్రత్తలు ఏమిటి?

డాక్టర్: గర్భిణులు అధిక బరువు ఎత్తరాదు. రక్తహీనత ఉన్న గర్భిణు లు తప్పకుండా ఆకుకూరలు, పండ్లు పాలు కోడిగుడ్లు ఎక్కువగా తీసుకో వాలి. మసాల ఆహారాలకు దూరంగా ఉండాలి. ఉప్పు తగినంత వాడాలి. పడుకునే సమయాల్లో కాళ్లకింద దిండు పెట్టుకోవాలి దీంతో కాళ్లకు వాపు లు రావు. ప్రతీ నెలవారిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలి.


శిథిలావస్థకు చేరిన పడిగెల ప్రభుత్వ బీసీ హాస్టల్ భవనం ఇదే..

శిథిలావస్థలో పడిగెల బీసీ హాస్టల్ భవనం

● మినరల్ వాటర్ ప్లాంట్ వినియోగం లేక ఇబ్బందులు
● పెచ్చులూడుతున్న భవనం స్లాబ్ పైకప్పు
● నూతన హాస్టల్ భవనం నిర్మించాలని పడిగెల విద్యార్థుల వేడుకోలు

వేల్పూర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలంలోని పడిగెల గ్రామంలో ప్రభుత్వ బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. సుమారు 45 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ హాస్టల్ భవనం గోడలు అక్కడక్కడ బీ టలు వారాయి. భవనం స్లాబ్‌పై పెచ్చులు ఊడిపడుతున్నాయి. కొన్నిగదుల తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో వర్షం కురిసిందంటే చాలు గోడల నుంచి స్లాబ్ పైకప్పు నుంచి నీరు వస్తోంది. నిర్మాణ సమయంలో స్లాబ్‌పైన ఫ్లోరింగ్ నాణ్యతగా చేయకపోవడం వల్ల వర్షం నీరు నిలిచిపో యి స్లాబ్ గోడల ద్వారా నీరు గదుల్లోకి వస్తోంది. గదులలో ఫ్యాన్‌లకు, లైట్‌లకు బిగించిన వైరింగ్ చాలా చోట్ల దెబ్బతినడం వల్ల గోడలు వర్షం నీటితో తడిసిన సమయ ంలో తేమ వచ్చి కరెంటు షాక్ వచ్చిందని గోడలను ముట్టుకోవాలంటేనే భయపడుతు ంటామని విద్యార్థులు తెలిపారు. ఇన్ని సమ స్యల మధ్య విద్యార్థులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. గత ఏడాది క్రితం ఇక్కడ మినరల్ వాటర్ ప్లాంట్ చెడిపోయినప్పటికీ నేటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో హాస్టల్ వార్డెన్ బయట నుంచి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తూ విద్యార్థులకు తా గునీరు అందిస్తున్నారు. వంద మంది విద్యా ర్థులు ఉన్న ఈ హాస్టల్‌లో కొన్ని బాత్‌రూం లు ఉన్నప్పటికీ వాటిలో కొన్నింటికి తలుపు లు వంగిపోవడం, గొళ్లాలు ఊడిపోవడం, త లుపులకు రంధ్రాలు ఉండడం వంటివి దర్శ నమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి నూతనంగా హాస్టల్ భవనాన్ని నిర్మించాలని, లేదా నాణ్యతతో కూడిన మరమ్మతులు చేపట్టాలని విద్యార్థు లు తల్లిదండ్రులు కోరుతున్నారు.


పెచ్చులూడిన బీసీ హాస్టల్ భవనంలోని ఓ తరగతి గది పైకప్పు

హాస్టల్ భవన మరమ్మతుల కోసం అధికారులకు విన్నవించాం

● భోజేందర్, హాస్టల్ ఇన్‌చార్జీ వార్డెన్, పడిగెల

పడిగెల ప్రభుత్వ హాస్టల్ భవన దుస్థితి ని పైస్థాయి అధికారులకు విన్నవించాం. భవనం గదుల్లో అక్కడక్కడ పెచ్చులుడింది. దెబ్బతిన్న కిటికిలు, తలుపులు, బాత్‌రూంల పరిస్థితులు పాడైపోయిన మినరల్ వాటర్ ప్లాంట్‌ల విషయాలను బీసీ వేల్ఫేర్ డెవల ప్‌మెంట్ అధికారికి వివరించాం. ఈ రాబోయే వేసవికాలం సెలవుల్లో హాస్టల్ భ వనంలోని అన్నిరకాల మైనర్ మరమ్మ తులు చేయిస్తామని చెప్పారు.


మరమ్మతులకు నోచుకోని మినరల్ వాటర్ ప్లాంట్

అభివృద్ధి ముసుగులో మొరం దందా!

● ఇందిమ్మ ఇళ్ల పేరిట పక్కదారి పడుతున్న మొరం
● పట్టించుకోని అధికార యంత్రాంగం


అక్రమంగా టిప్పర్‌లో ఎడపల్లికి తరలిస్తున్న మొరం

ఎడపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని జైతాపూర్ గ్రామాన్ని ప్రజాపాలన పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి 128 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. మంజూరు చేసిన ఇందిమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మందకొడి గా జరగడంతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మండల అధికారు లు సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మొరం, ఇసుక లేక ఇబ్బంది అవు తుందని తెలుపగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బం దులూ కలుగకుండా మొరం, ఇసుక తరలింపుకు అనుమతి ఇవ్వా లని ఎడపల్లి తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదే అదునుగా భావిం చిన మొరం మాఫియా రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా ప్రతీ రోజు అక్రమ మొరం తవ్వకాలు చేపడుతున్నారు.

● పక్కదారి పడుతున్న మొరం తవ్వకాలు

వాస్తవానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తరలించాల్సిన మొ రం పక్కదారి పడుతోంది. కాసుల కక్కుర్తితో కొందరు మొరం వ్యా పారులు రెవెన్యూ అధికారులకు మామూళ్లు ఇస్తూ మొరాన్ని ఇత రులకు అధిక ధరలకు అమ్ముకుంటు న్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇంది రమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తాము చేపట్టి న గృహ నిర్మాణాల వద్దకు టిప్పర్‌లు వెళ్లవని ట్రాక్టర్‌లకు అనుమతి ఇవ్వాల ని సమీక్షా సమావేశంలో అధికారులను కోరారు. ఇంత వరకు అంతా బాగానే ఉంది కానీ ఇక్కడే అసలు కథ మొదలైంది. ట్రాక్టర్‌లలో ఇందిరమ్మ ఇళ్లకు తరలించాల్సిన మొరం టిప్పర్‌లలో ఇతర గ్రామాలకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటూ విలువైన వన సంపదను కొల్లగొడుతున్నారు. వీరికి రెవెన్యూ అధికారులు సహాయ సహకారాలు అందించడంతో వీరి అక్రమ వ్యాపారం మూడు పూవ్వలు.. ఆరు కాయలుగా సాగుతోం ది. జైతాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకని చెప్పి రెవెన్యూ అధికారులే మొరం మాఫియాకు తవ్వినంత తవ్వు కోండి ఎవరైనా అడిగితే ఇందిరమ్మ ఇళ్లకని చెప్పండి అని చెప్పడం కొసమెరుపు.

ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు

● ధన్వాల్, తహసీల్దార్

ఎడపల్లిలో మొరం తవ్వకాలకు ఎలాం టి అనుమతులు ఇవ్వలేదు. గ్రావెల్ రోడ్డు కు మొరం అవసరం ఉంటే అనుమతి తీసుకుని ప్రభుత్వానికి డీడీ చెల్లించి అనుమతి తీసుకోవాలి. ఎలాంటి డీడీలూ చెల్లించకుండా మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

● ఎడపల్లిలో అధిక ధరలకు మొరం అమ్మకం

జైతాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లకు, ఏఆర్పీ గ్రామంలో గ్రావెల్ రోడ్డుకు అని చెప్పి మొరం మాఫియా ప్రభుత్వానికి ఒక్క రూపా యి కట్టకుండా వడ్డాపల్లి గ్రామంలో ఇష్టారీతిన మొరం తవ్వకాలు చేపడుతున్నారు. ఈ మొరాన్ని ఇఎడపల్లి మండల కేంద్రంలో అధిక ధరలకు అమ్ముతున్నారు.


సుద్దులం, కోరట్‌పల్లి శివారులో ఆలయ భూముల్లో వరి సాగు చేస్తున్న దృశ్యం (ఫైల్)


మరమ్మతులు లేక దెబ్బతిన్న ఆలయం పైకప్పు

రామా.. నీ భూములకు రక్షణేది?

● సుద్దులం, కోరట్ పల్లి గ్రామాల శివారులో ఇందల్వాయి రామాలయ భూములు
● 45 ఎకరాలను అక్రమంగా సాగు చేసుకుంటున్న వైనం ● పట్టించుకోని దేవాదాయ శాఖ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అది 187 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాచీన ఆలయం. ఎంతో ప్రచుర్యం కలిగిన ఆలయం నేడు నిర్లక్ష్యానికి గురవుతోంది. ఆ గుడి ఇందల్వాయి రామాలయం. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ రామాలయం భూములు డిచ్‌పల్లి మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి, గ్రామాల శివారులో సుమారు 45 ఎకరాలకు పైగా ఉన్నాయి. కానీ దేవాలయ శాఖ ఈ భూ ములపై శ్రద్ధ చూపని కారణంగా దేవుని మాన్యం కబ్జా కోరల్లో చిక్కుకుంది. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపో వడంతో ఆలయం కూలిపోయే దశకు చేరుకుంది ఇప్పటికే కల్యాణ వేదిక, సత్రాలు, యజ్ఞశాల, మండపాలు, కూలిపో యే దశకు చేరుకున్నాయి. గత మూడేళ్ల క్రితం నాటి రాష్ట్ర దేవాలయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లు గ్రామస్థుల కోరిక మేరకు ఆలయం సందర్శించారు. ఆలయ అభివృద్ధికి నిధు లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన అది కార్యరూపం దాల్చలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం సైతం మారిపోవడం ఆ విషయం కాస్తా మూలన పడింది. ఎండోమెంట్ అధికా రులు నిర్లక్ష్య ధోరణితో గ్రామస్థులు, భక్తులు, అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామాలయానికి చెందిన కోట్లాది రూ పాయలు విలువ చేసే భూములను తమ పేర పట్టాలు చేసుకునేందుకు కబ్జా రాయుళ్లు విశ్వప్రయత్నాలు చేస్తు న్నారు. దీనికోసం ప్రజాప్రతినిధుల చుట్టూ చక్కర్లు కొడు తున్నారు. రామాలయ భూములపై కోర్టులో న్యాయ పరి ష్కారం కోసం దేవాదాయ శాఖ అధికారులు కేసులు వేశారు. అవి ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటాం

● ప్రభాకర్, తహసీల్దార్

రామాలయానికి చెందిన భూముల్లో కొందరు రైతు లు అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి చెందిన భూముల్లో రైతుల కబ్జాలో ఉన్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. త్వరలోనే వాటిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకోనుంది. ప్రభుత్వ భూములను ఎవరు కబ్జా చేసినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

డంపింగ్ యార్డులో అగ్నిప్రమాదం



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులోని డంపింగ్ యార్డుకు నిప్పంటుకోగా దట్టమైన పొగ పరిసరాలను కమ్మేసింది. సమీప కాలనీలకు పొగ వ్యాపించడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదివారం డంపింగ్ యార్డుకు చేరుకున్నారు. డంపింగ్ యార్డుకు నిప్పంటుకోవడం ఏమిటని ప్రశ్నించారు. పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి ట్యాంకర్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. కాలుతున్న చెత్తలో ఎక్కువ భాగం ప్లాస్టిక్ వ్యర్థాలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ వ్యర్థాలతో పాటు టపాసులు పేలడంతో పెద్ద శబ్దాలతో ప్రజలు భయాభ్రాంతులకు గురయ్యారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చామని డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం జరగడంపై పూర్తిస్థాయి విచారణ చేపడతామన్నారు. బోధన్ సబ్ కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

● అగ్నిమాపక శాఖ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలి

బోధన్‌రూరల్: అగ్నిమాపక శాఖ సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. ఆదివారం అగ్నిమాపక శాఖ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఆయన బోధన్ పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారోత్సవాలలో ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని, అనుకోకుండా ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండి మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పమాదకరంగా విద్యుత్ వైర్లు



ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లు

సిరికొండ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ లూస్ లైన్ల వల్ల రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయిని పలు గ్రామాల్లో రైతులు చెపుతున్నారు. సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ లూస్ లైన్లు ఏర్పడడడం వల్ల రైతులు ట్రాన్స్‌కో అధజకారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.ఎండలు మండుతునన్న నేపథ్యంలో వైర్లు ఎండకు సాగుతునాయో ఏమో కాని గాలీ దుమారాలకు వైర్లు కలిసి పోయి విద్యుత్ సరాపరా నిలిచిపో తుందని పలు గ్రామాల ప్రజలు చెతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద లైన్లన్ని లూస్ కావడం వల్ల రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు.ఇటీవల సిరికొండ మండలంలోని పందిమడుగు గ్రామ సమీపాన తెల్ల వలుగు తండా వద్ద వరి పొలాన్ని కోస్తున్న హార్వెస్టరు కు విద్యుత్ వైర్లు టైర్లు బ్లాస్టు అయినట్లు రైతులు చెప్పారు. అదృష్ట వశాత్తు డ్రైవరు బతికి బయట పడ్డారు.ప్రతి ఏడాది ఇలాగే గ్రామాల్లో ఎక్కడోక్కడ ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయని రైతులు చెపుతున్నారు.గ్రామాల్లో అయితే సరేసరి. వైర్లు లూస్ కావడం వల్ల కిందికి రావడం మూఖలంగా ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి లూస్ లైన్లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మహనీయుల జయంతి కరపత్రాల ఆవిష్కరణ

బోధన్‌రూరల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): బోధన్‌పట్టణంలోని స్థానిక రైస్‌మిల్లు అసోసియేషన్ భవన్‌లో ఆదివారం ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ ఆధ్వర్యంలో మహనీయుల జయంతి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ నీరడి ఈశ్వర్ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదిన అంబేద్కర్ చౌరస్తాలో జరిగే మహనీయుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జ్యోతిబా పులే, బాబు జగ్జీవన్ రామ్ జయంతిని విజయవంతం చేయడానికి బోధన్ డివిజన్‌లోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు రావాలని కోరారు. మహనీయుల జయంతికి ముఖ్య అతిథులుగా డాక్టర్ జేబీ రాజు, దళిత సేన అధ్యక్షులు, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, డీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, గజ్జెల అశోక్ కళాబృందం నాగ్‌పూర్ నుండి అంజలి భారతి, గౌతం భలేరావ్, అమ్‌నా సమ్‌నా కార్యక్రమాలతో పాటు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ బోధన్ డివిజన్ కోకన్వీనర్ నీరడి రవి, సంగడే పాండు, దేవేందర్, సలహదారులు కొండ్ర వెంకటి, వాగ్మారే సూర్యకాంత్, కోశాధికారి మాదస్తు శ్రావణ్ కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు దాసరి శ్యామ్, కారం స్వామి, రాహుల్, భీంరావు, ఉదయ్, ఇందూరు సాయిలు, గౌతంకుమార్, చరణ్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా
భద్రత చర్యలు పాటించాలి:సీపీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రమాదాలు జరిగిన చోట ఎక్కువ నష్టం వాటిల్లకుండా నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రమాదాలు ఎక్కడైనా, ఎప్పుడైనా జరగవచ్చని అగ్నిమాపక సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. పారిశ్రామిక ప్రదేశాల్లో సినిమా హాల్లు, రద్దీగా ఉండే షాపింగ్‌మాల్‌లలో యజమానులు అగ్నిమాక భద్రత నియామాన్ని తప్పనిసరిగా పాటించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణలపై ప్రశ్నలు వేసి సమాదాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన ఎస్‌పే రైటింగ్, డ్రాయింగ్ కాంపిటేషన్‌లలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇటీవల విశ్రాంతి పొందిన అగ్నిమాపక ఉద్యోగులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, నర్సింగ్‌రావు, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఘనంగా చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలు



బోధన్‌లో ఏపీ సీఎం జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

బోధన్‌రూరల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను బోధన్‌లో తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకులు సీహెచ్‌వీ హన్మంత్ రావు, కోట గంగా రెడ్డి, బాల గంగాధర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఒక విజనరీ నాయకుడు అని కొనియాడారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్థిక అభివృద్ధికి, సాంకేతికత పురోగతికి ఆయన వేసిన పునాదులు భారత దేవం గర్వించేలా చేశాయన్నారు. తెలుగు వారి ఆశయం, అభిమానం ఆయన రూపం గ్రామీణ అభివృద్ధి నుండి ఐటీ విప్లవం వరకు ఆయన చూపిన నాయకత్వం అపూర్వమని, యువతకు ప్రేరణ, భవిష్యత్‌కు దిక్సూచి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పావులూరి వెంకటేశ్వర్ రావు, దత్త కృష్ణ, భాస్కర్, మువ్వ శ్రీను, రావెళ్ల భాస్కర్, కిరణ్, సచిన్ పటేల్, సుమిత్, శివకుమార్, భానుప్రకాష్, పావులూరి సుబ్బారావు, పావులూరి సుజాత తదితరులున్నారు.

సుభాష్‌నగర్:ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వ హించారు. జిల్లాలోని వివిధ మండలాల్లో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని దుబ్బచౌరస్తా లో నగర కన్వీనర్ అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఐటీ రంగానికి బీజంవేసి ప్రపంచ దేశాలకు పోటీగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడుతూ ఈ వయసులో కూడా ప్రజల కోసం పాటుపడుతూ ముందుకెళ్తున్నాడని అన్నారు.ఈకార్యక్రమంలో వినోద్ కుమార్, బొబ్బ నర్సింహరావు, కోయిడి నర్సింలు, పురు షోత్తం, మల్లారెడ్డి, లవంగరాజు, ఇప్పలపల్లి విష్ణు, వేముల నాగేశ్వర్ రావు, జాఫర్, రషీదా, రాములు, గంగోనె రాజేశ్వర్, లక్ష్మీ యాదవ్, కమలబాయి, రవికుమార్, రామకృష్ణారెడ్డి, నటరాజ్ పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ దొందు దొందే:రూరల్ ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంనగర్, శాస్త్రినగర్, శ్రీనగర్‌లలో పలు అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపన చేసిన నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ. బీఆర్ఎస్ పార్టీలు తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు అడ్డుపడుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ గత పది సంవత్సరాలు ప్రభుత్వంలో ఉండి ప్రజలకు చేసిం దేమీ లేదని ఆయన ఎద్దేవా చేశారు. తమ స్వా లాభం కోసం మాత్రమే బీఆర్ఎస్ పార్టీ పాటు పడిందని ప్రజలను ఏమాత్రం పట్టించు కోకపోవడం గమనార్హమని ఆయన గుర్తుచేశారు. బీజేపీ రాష్ట్రంలో 8సీట్లు గెలిస్తే వారు గుజరాత్‌కు గులాంగిరికి మాత్రమే పనిచే స్తున్నారని ఆయన అన్నారు. మన రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా గెలిచి గుజరాత్ వాళ్లకు తొత్తులుగా పనిచేయడం సిగ్గుచేటని, ఇంటి దొంగల్లా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పట్టుమని పదిహేను నెలలు కాకుండానే అభివృద్ధి కాలేదని అభివృద్ధి చేయడానికి మేము శాయశక్తులా శ్రమపడుతున్నామని, అతి త్వరలో తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని, ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, 500లకే గ్యాస్ సిలిండర్‌లాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మున్ముందు మిగతా హామీలను కూడా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీ చెప్పే జూటాపు మాటలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ అంటే భారతీయ జూటా పార్టీ అని, బీఆర్ఎస్ అంటే స్కామ్‌లకు, లిక్కర్ స్కామ్‌లకు నిలయమని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఫామ్‌హౌజ్‌కే పరిమితమై కాంగ్రెస్ ప్రభుత్వం పైన విమర్శలు వెదజల్లుతున్నారని ఇవి ఏమాత్రం తమకు సంమంజసం కాదని, త్వరలోనే తమ ప్రభుత్వం తమదైన శైలిలో మాజీ ముఖ్యమంత్రికి సమాధానం చెప్తా మని ఆయన అన్నారు. రాబోయే ఐదేళ్లలో మండలంలోని ప్రతి గ్రామంలో నిరుపేదలకు వందశాతం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని ఆయన అన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని చాలామేరకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేయించడం జరిగిందని, గత ప్రభుత్వం ఎమ్మెల్యేలు ఒక్కసారైనా ఈ గ్రామాల చుట్టు తిరగని ఎమ్మెల్యేలు మేము చేసిన అభివృద్ధి పనులు చూసి సిగ్గుతెచ్చుకొని తమప్రభుత్వంపై బురదజల్లడం ఇకనైనా మా నుకొని అభివృద్ధికి అడ్డుపడకుండా ఉండాలని ఆయన కోరారు. స్వయంగా దేశ ప్రధాని అబద్దాలు ఆడితే దేశంయొక్క పరిస్థితి ఏంటని ఆయన మండిపడ్డారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏనుగులు, అడవి జంతువులు ఎక్కడ ఉన్నాయని అవి ఉన్నట్లు ఫోటోలు మార్ఫ్ చేసి అబద్దాలు ఆడడం పట్ల ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎల్లయ్య, అమలం దత్తు, గుండారం పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బాగిర్తి బాగారెడ్డి, అగ్గుభోజన్న, అమలం దత్తు, ఒడ్డెన్న, నగేష్, మాజీ వైస్ ఎంపీపీ కొండరాజు, ఖానాపూర్ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వనజీవి రామయ్యకు
ఘన నివాళులు



వనజీవి రామయ్యకు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రోటరీ సభ్యులు

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ ప్రేమికుడు పద్మశ్రీ అవార్డు గ్రహిత వనజీవి రామయ్యకు ఆర్మూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు రజినీష్ కిరాడ్ మాట్లాడుతూ కోటి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన మహనీయుడు వనజీవి రామయ్య అని కొనియాడారు. నేటి యువతరానికి, బావితరాల విద్యార్థులకు వనజీవి రామయ్య ఆదర్శ ప్రాయుడని వారు కొనియాడారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునం దించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి రాస ఆనంద్, కాంతి గంగారెడ్డి, చరణ్‌రెడ్డి, విజయసాగర్ రెడ్డి, పట్వారి గోపికృష్ణ, పట్వారి తులసి, రాధకిషన్, ఖాందేష్ సత్యం, నరేష్, మారుతి పాల్గొన్నారు.

కూలీలను ఢీకొన్న ట్రాక్టర్

● ఒకరు మృతి, ఇద్దరికి గాయలు

సిరికొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ డ్రైవర్ తప్ప తాగి రోడ్డు పక్కన ఉన్న కూలీలను ఢీకొట్టిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు.. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించేందుకు బీహార్ నుంచి వచ్చిన కూలీలు లారీలో ఎక్కించారు. లారీ వెళ్లిపోయిన తరువాత రోడ్డు పక్కన గల చెట్టు కింద ముగ్గురు కూలీలు సేద తీరారు. కాగా ఒంటిప్ప తండా నుంచి కొండాపూర్ వైపు వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ బట్టు జబ్బర్ మద్యం తాగి రోడ్డు పక్కన సేద తీరుతున్న కూలీలపై నుంచి తీసుకెళ్లాడు. దీంతో భూమశ్రీ(50)అనే కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరు కూలీలు చింటు, గోవింద్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై రాము ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను 108లో, మృతి చెందిన భూమశ్రీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, ట్రాక్టరు

భారతీయ సంస్కృతికి యునెస్కో గుర్తింపు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి):భారతీయ సంస్కృతి వారసత్వానికి చారిత్రిక గుర్తింపు లభించిందని, శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతతో పాటు భరతముని రచించిన నాట్య శాస్త్రానికి యునెస్కో నుంచి చోటు ల భించడం అభినందనీయమని తెలం గాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి, రాష్ట్ర ఉపా. ధ్యక్షులు ప్రేమ్‌లాల్ అన్నారు. భారతీయ జ్ఞానసంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గుర్తించిందని అన్నారు. మన దేశం ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భార తీయు డు గర్వపడే విషయమని తెలిపారు. భగవత్ గీతను భరత ముని నాట్య శాస్త్రానికి యునెస్కో అవార్డు రావడం హర్షించదగ్గ విషయమన్నారు.

వ్యాసరచన పోటీల్లో కాకతీయ విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 20: (ఆంధ్రజ్యోతి):అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నిర్వ హిం చిన వ్యాసరచన పోటీల్లో కాకతీయ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వతేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో లక్ష్మీ ప్రసన్న, డ్రాయింగ్ పోటీలో వైష్ణవి విజేతలుగా నిలిచారు.వీరికి సీపీ సాయిచైతన్య బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా పాఠ శాల డైరెక్టర్ రామోజీరావు, ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు.



డొంకేశ్వర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భూ భారతి చట్టం రైతులకు భరోసా కల్పిస్తుంది

(ఐదో పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా అమలవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్,ఆర్డీవోరాజాగౌడ్,వివిధశాఖలఅధికారులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం..

డొంకేశ్వర్: భూ భారతి చట్టంతో రైతుల భూ సమస్యలన్నీటికి సత్వర పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో భూభారతి నూతన ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా పెండింగ్ సాదాబైనామ దరఖాస్తులకు పరిష్కారం దొరుకుతుందన్నారు. భూమి హక్కుల రికార్డులు భూభారతి పోర్టల్‌లో అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌కు పలు సమస్యలను వివరించారు. అసైన్డ్ భూములకు కూడా పట్టాలు ఇప్పించాలని సాగు చేస్తున్నప్పటికీ పట్టాలు లేక రైతులు ఇబ్బందులు ఎదురొకంటున్నామని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషన్ కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్డీవో రాజాగౌడ్, ఆర్‌ఐ అశోక్ సింగ, ఎంపీడీవో బ్రహ్మానందం, ఏవో మధుసుదన్, పశువైద్యాధికారి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, మారంపల్లి లిఫ్ట్‌చైర్మన్ బోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు రకం ధాన్యం సేకరణకు అనుమతి లేదు



మూషీర్‌నగర్‌లో కుప్పలుగానే ఉన్న దొడ్డు ధాన్యం

సిరికొండ ఏప్రిల్ 20: ప్రభుత్వం రైతులు పండించిన ప్రతీ గింజను గొనుగోలు చేస్తామని ప్రకటింస్తున్నప్పటికీ గ్రామాల్లో అందుకు విరుద్ధంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వ్యవహరిస్తున్న తీరు రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రైతుల పండించిన ధాన్యాన్ని తడిసిన, ఎండిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నదని అధికారులు,ప్రజా ప్రతినిధులు బహిరంగా ప్రకటించినప్పటి నుంచి రైతుల్లో కొంత మేరకు ఆనందం వెల్లువిరిసింది. కాని మూషీర్‌నగర్‌లో గత ఇరువై రోజుల నుంచి దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయడానికి కేంద్రం నిర్వాహకులు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.సుమారు ఇరువై మందికి పైగా రైతు దొడ్డు రకం ధాన్యాన్ని పండించి కల్లాల్లో ఇరువై రోజుల నుంచి ఎండబెట్టినట్లు రైతులు చెప్పారు.ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఎప్పుడు అడిగిన మాకు దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వ ఆదేశాలు లేవని చెపుతున్నారు.మూషీర్‌నగర్‌లో ఐడీసీఎంఎస్,ఐకేపీ కొనుగోలు కేంద్రాలుండగా ఐడీసీఎంఎస్ కేంద్రంలో దొడ్డురకం ధాన్యం సేకరించడానికి అనుమతి లేదని చెపుతున్నారని శ్రీనివాస్ తెలిపారు.ఐకేపీ కేంద్రంలో కూడ తమకు దొడ్డు రకంధాన్యం తూకం వేయమని చెపుతున్న పటిం చుకునే వారే కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే విష యాన్ని కేంద్రం నిర్వాహకులను అడిగితే దొడ్డురకం ధాన్యం సేకరణ ధా న్యం సేకరించాలని లేదని చెపుతున్నారని రైతులు చెపుతున్నారు ఇప్పటి కైనా ఐకేపీఅధికారులు రైతులధాన్యాన్ని కొనుగోలు చేయా లని కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన పలు పార్టీల నాయకులు



మోపాల్ బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న గ్రామస్థులు

మోపాల్,ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు బాజిరెడ్డి జగన్మోహన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన మోపాల్ మండల చిన్నాపూర్ గ్రామం, తండా నాయకులు. మోపాల్ మండలం చిన్నాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షులు సిద్ధార్థ రెడ్డి చిన్నాపూర్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకులు రూప్‌సింగ్ వారి అనుచరులతో కలిసి రూరల్ నియోజకవర్గ నాయకులు బాజిరెడ్డి జగన్మోహన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్మోహన్ వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.వారిని పార్టీ ఎల్లప్పుడు కాపాడుకుంటుందని, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన అన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.96,000	రూ.89,000	రూ.1010

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (10.00, 1.00, 4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ఓదెల-2 (10.00, 1.05, 4.10, 7.15, 10.20)
స్క్రీన్-3 : పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (11.05)
: జాట్ (హిందీ) (1.30)
: సిన్నర్స్ (ఇంగ్లీష్) (4.40, 7.40, 10.40)
స్క్రీన్-4 : డియర్ ఉమా (11.00)
: ది చూసెన్ లాస్ట్ సుప్పర్ (ఇంగ్లీష్) (2.10, 7.40)
: జాక్ (4.45)
: పడ్డింగ్టన్ ఇన్ పేరు (హిందీ) (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓదెల-2 (10.40, 1.30, 4.30, 7.20, 10.20)
స్క్రీన్-2 : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.00, 1.35, 4.30, 7.25, 10.20)
స్క్రీన్-3 : గుడ్ బ్యాడ్ అగ్లీ (11.00, 10.40)
: ఒక్కడు (1.40, 7.40)

లలితామహల్ : జాక్ (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : అర్జున్ సన్‌ఆఫ్ వైజయంతి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : జాట్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఓదెల-2 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్